క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



అలంకరణలో స్వామివారు

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే గురువారం స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వర శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, శ్రీధర్‌పంతులు, బాబు తదితరులు ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా రమేష్



తుర్కయంజాల్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారిగా తుర్కయంజాల్‌కు చెందిన బచ్చిగళ్ల రమేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ రెండు పర్యాయాలుగా రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పని చేశాడని గుర్తు చేశారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రమేష్ పేర్కొన్నారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి ఉత్సవాలు



ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

మంచాల: నేటి (గురువారం) నుంచి ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 22న కలశ స్థాపన, అంకుర్పన చేస్తారు. 23 రాత్రి 8-00 గంటలకు కల్యాణోత్సవం, 24న అగ్ని ప్రతిష్ఠాపన, రథాంగహోమం జరగనుంది. 25న ఉదయం రథోత్సవం ఊరేగింపు చేస్తారు. 26న హోమం, నాగవల్లి, పూర్ణాహుతి నిర్వహించడం జరుగుతుంది. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు.

ఆమనగల్లు సీఐగా విజయ్‌కుమార్



బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్

ఆమనగల్లు: ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.విజయ్‌కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకుమందు పని చేసిన వెంకటేశ్వర్లు ఇటీవల బదిలీ కాగా సైబరాబాద్ కమిషనరేట్‌లో సైబర్ క్రైంలో సీఐగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ ఆమనగల్లుకు బదిలీపై వచ్చారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐగా విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం, సిబ్బంది సీఐ విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి

కాంగ్రెస్ నాయకుడు బిచ్యానాయక్



కడ్తాల్: 23న కల్వకుర్తిలో నిర్వహించనున్న నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని, ఆ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు హాజరవుతారని చెప్పారు.

లింకు రోడ్లు బాగయ్యేదెన్నడో?

కంకర తేలి పూర్తిగా ధ్వంసం • ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వైనం



చాంద్‌ఖాన్‌గూడ-ఆరుట్ల రోడ్డు

మంచాల: ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన లింకు రోడ్లను బాగు చేసే నాథుడు కరువయ్యాడు. సంవత్సరాలుగా కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్లను కాంగ్రెస్ ప్రభుత్వమైన బాగు చేయాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు. మంచాల మండలంలోని ఆగాపల్లి నుంచి నోముల, చాంద్‌ఖాన్‌గూడ గేట్ నుంచి బుగ్గతండా రోడ్డు వరకు, బుగ్గతండా- ఎల్లమ్మ తండా రోడ్లు ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనవి. ఈ రోడ్లను గత 20 ఏళ్ల కిందట వేశారు. అప్పటి నుంచి తిరిగి మరమ్మతులు చేసిన పాపాన పోలేదు.

బుగ్గతండా-ఎల్లమ్మ తండా..

మండల కేంద్రం నుంచి ఆరుట్ల మీదుగా బుగ్గతండా, ఎల్లమ్మ తండా, బోడకొండ, లోయపల్లి, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. నేడు కంకర తేలి రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డు పూర్తి పాడైపోవడంతో జాపాల గ్రామం మీదుగా తిరిగి ఆరుట్ల , మంచాల గ్రామాలకు చేరుకుంటున్నారు.

చాంద్‌ఖాన్ గూడ- ఆరుట్ల

చాంద్‌ఖాన్ గూడ –ఆరుట్ల రోడ్డు పాడైపోయి గత ఆరు సంవత్సరాలు అవుతుంది. బాగు చేస్తామని కంకర తొవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రజలకు నిత్యం అవసరం ఉన్న రోడ్డును తక్షణమే బాగు చేసి ప్రజల ప్రయాణాలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆగాపల్లి - నోముల..

ఆగాపల్లి– నోముల రోడ్డు వేసినప్పటి నుంచి నేటి వరకు తట్టెడు మట్టి కూడా పోయలేదు. పూర్తిగా కంకర తేలిపోయి గుంతలమయంగా మారింది. రాత్రిపూట ఈ రోడ్డు మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉన్న లింకు రోడ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైన పట్టించుకోని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా మారింది



చాంద్ ఖాన్ గూడ – ఆరుట్ల రోడ్డు కంకర తొవ్వి వదిలేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నిత్యం వందలాది మంది ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు. తక్షణమే బాగు చేయాలి.

- ఓరిగంటి భాస్కర్‌గౌడ్, జాపాల

చాలా గ్రామాలకు దగ్గరవుతుంది..



బుగ్గతండా– ఎల్లమ్మతండా లింకురోడ్డును బాగుచేస్తే ఎల్లమ్మ తండా, కొర్రవాణి తండా, బోడకొండ, లోయపల్లి, దాద్‌పల్లి, రంగాపూర్ గ్రామాల నుంచి ఆరుట్ల చేరుకోవడం సులభమవుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డును బాగు చేయాలి

-కొర్ర శంకర్‌నాయక్, కొర్రవాణి తండా

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్



అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

తలకొండపల్లి: తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉందని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని జంగారెడ్డిపల్లి, పెద్దూర్ తండాల ప్రాథమిక పాఠశాల్లో రూ. 20 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన అదనపు తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలుగా ఎంపిపి నిర్మలతో కలిసి అదనపు గదులను వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీపీలను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, స్పెషల్ ఆఫీసర్ రమేష్‌నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, రఘు, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఎంపీటీసీ జోగు రమేష్, సోని, లఖ్య, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సింగిల్‌విండో డైరెక్టర్లు శేఖర్‌యాదవ్, హెచ్ఎంలు అనురాధ, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలం, కార్యదర్శులు జానయ్య పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందిస్తాం

తలకొండపల్లి: నిరుపేద విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందిస్తామని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల నిర్మాణం చేపట్టి అనాథ పిల్లలు, పేద విద్యార్థులకు విద్యను అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డు వద్ద అరఎకర స్థలంలో ఆశ్రమ పాఠశాల నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాసు రెడ్డితో కలిసి కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేశారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలతో పాటు, ఆర్థిక స్తోమత లేని నిరుపేద విద్యార్థులను చేర్పించి విద్య బోధన చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలితాజ్యోతయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, యాదయ్య, వెంకటేషు, శ్రీనివాసురెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరిపారు. స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేశధారణలో పాఠశాలకు వచ్చి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వపరిపాలన దినోత్సవంలో డీఈఓగా మనీష, ఎంఈఓగా శ్రీతేజ్, ప్రధానోపాధ్యాయుడిగా శివకుమార్, ఉపాధ్యాయులుగా శివకుమార్, హరిణి, శ్రీలేఖలు వ్యవహరించారు. అనంతరం జరిగిన ముగింపు సమావేశంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మణిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారిల ఆర్థిక అభివృద్ధికి కృషి

కమిషనర్ సత్యనారాయణరెడ్డి



సఫాయి కర్మచారిలతో కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయంజాల్: సఫాయి కర్మచారిల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని పుర కమిషనర్ బి. సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొహెడ వార్డు కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నమస్తే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సఫాయి కర్మచారిలు విధుల నిర్వహించే సమయంలో తప్పనిసరిగా రక్ష పరికరాలను ధరించాలని, మురికి కాలువలు శుభ్రపరిచేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ అనుబంధ నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోని సబ్సిడీలు పొంది ఆర్థికంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ హరీశ్, మున్సిపల్ సిబ్బంది భానుమతి, రోజా పాల్గొన్నారు.

నూతన నియామకం



నర్ల శ్రీశైలం

మంచాల: రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్‌ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలకొండ కాంతయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా కాంతయ్య మాట్లాడుతూ.. మండలంలోని ఆస్మత్‌పూర్ గ్రామానికి చెందిన నర్ల శ్రీశైలం యాదవ్ సీపీఐ కార్యకర్తగా అంచలంచెలుగా ఎదిగి పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశాడని చెప్పారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నుంచి పార్టీ అనుబంధ సంఘాలలో పని చేయడమే కాకుండా సీపీఐ మండల కార్యదర్శి , రైతు సంఘం మండల అధ్యక్షుడి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారని గుర్తు చేశారు. పార్టీ పిలుపు మేరకు ఈ ప్రాంతంలో ప్రజా సమస్యలపై పోరాటం చేశాడని అన్నారు. ఆయన కృషిని గుర్తించి వ్యవసాయ కార్మిక సంఘం నియోజక వర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియామకం చేశామని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

మంచాల: మండలంలోని తిప్పాయిగూడలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు బుధవారం ఎంపీటీసీ సుకన్య, ప్రత్యేకాధికారి తేజ్ సింగ్, స్థానిక నాయకులు వీరేష్ గౌడ్, కోమురయ్య, ఐలయ్య, చంద్రయ్య, మహేష్ తదితరులు పాల్గొని ప్రారంభించారు. అలాగే జాపాల గ్రామంలో కూడా సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్, ఎంపీటీసీ సభ్యుడు చంద్ర శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ, దశరథ, మహేష్‌గౌడ్, లింగం గౌడ్, పరమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎంపీటీసీ ఉమావతి



భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ, నాయకులు

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీటీసీ సభ్యురాలు ఉమావతి బుగ్గయ్యగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని ఎక్వాయిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. కావునా ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, యాదయ్య, రమేశ్‌నాయక్, కరుణాకర్, చోటే, వెంకటేశ్, బాలరాజు, అనిత, రాజు, జంగయ్య, నరేశ్, బీచ్యానాయక్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి సమావేశం

తలకొండపల్లి: కల్వకుర్తి పట్టణంలోనాగర్ కర్నూల్ పార్లమెంటరీ కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం ఉ. 10 గంటలకు (ఈ నెల 23న)నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిలుగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లు రవి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ్మారెడ్డిలతో పాటు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు హాజరవుతున్నారని ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మండలంలోని కార్యకర్తలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బాధిత యువకుడికి చేయూత



సదరం సర్టిఫికెట్, బసుపాస్‌ను అందజేసిన రాజేందర్‌నాయక్, నాయకులు

కడ్తాల్: గత రెండు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని వాస్‌దేవ్‌పూర్‌కు చెందిన పాత్లవత్ కృష్ణ రెండు కాళ్లు విరిగాయి. బాధితుడిది నిరుపేద కుటుంబం కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోంటున్నాడు. విషయం తెలుసుకున్న యువజన నాయకుడు రాజేందర్‌నాయక్ బాధితుడికి తెలంగాణ మెడికల్ డిపార్ట్‌మెంట్ ద్వారా రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కృష్ణకు 68 శాతంతో సదరం సర్టిఫికెట్, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఫ్రీ బస్‌పాస్ వచ్చేందుకు తోడ్పాటునందించారు. ఈ మేరకు బుధవారం బాధితుడికి సదరం సర్టిఫికెట్, ఉచిత బస్‌పాస్‌ను రాజేందర్‌నాయక్ అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతో రాజేందర్‌నాయక్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, నాయకులు లక్ష్మన్‌నాయక్, రామకృష్ణ, సుమన్, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, బీచ్యా, పవన్,మోహన్, హరికిషన్, శ్రీను తదితరులు ఉన్నారు.

డ్రామా విభాగంలో విద్యార్థులు ప్రతిభ



విద్యార్థులు, ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పరమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంగ్లిష్ లాంగ్వేజీ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభా విభాగంలో ఎంపీపటేల్‌గూడ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. డ్రామా విభాగంలో తనదైన శైలిలో రాణించారు. జిల్లా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇంతటి ఘనకీర్తికి కారణమైన ఇంగ్లిష్ టీచర్ సలమాన్, విద్యార్థులను బుధవారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్, మండల నోడల్ అధికారి శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా నాయకులు యాదగిరెడ్డి, శేఖర్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్రను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రవీందర్

బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్

యాచారం: రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఎంపీలుగా గెలుపొందాలని సంకల్పంతో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర 23న యాచారం మండలంలోకి ప్రవేశిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. విజయ సంకల్ప యాత్రకు సంబంధించి వాల్ పోస్టర్లను బుధవారం యాచారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు మరింత మేలు జరుగుతుందన్నారు. 23న ఉ.11 గంటలకు మాల్ కేంద్రం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేదా మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లు ఎవరో ఒకరు పాల్గొంటారని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ శ్రేణులు తరలి వచ్చి యాత్రను జయప్రతం చేయాలని పిలుపునిచ్చారు. యాదయ్య, రమేష్, శ్రీనువాస్ యాదవ్, శ్రీనువాస్‌గుప్త, శేఖర్, మల్లేష్, నాగరాజు, దయాకర్, గణేశ్, సురేశ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రసవత్తరంగా పీఏసీఎస్ రాజకీయం!

- నేడు ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం
- ప్రిసైడింగ్ అధికారిగా డీసీఓ ధాత్రిదేవి



ఉప్పరిగూడ పీఏసీఎస్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌లపై ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో గురువారం అవిశ్వాస సమావేశం జరగనుంది. పదవి నుంచి వారిని తొలగించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారిణి ధాత్రిదేవికి 11 మంది సంఘం సభ్యులు అవిశ్వాస నోటీసులు గత నెల 31 ఇచ్చిన సంగతి తెలిసిందే. పార్టీలకు అతీతంగా సంఘం సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుదర్శన్‌రెడ్డి సంఘ చైర్మన్‌గా, క్యామ శంకర్ వైస్ చైర్మన్ కొనసాగుతున్నారు. సంఘంలోని 13 మంది సభ్యులకుగాను 11 మంది సభ్యులు ఏకమై అవిశ్వాస తీర్మానం చేశారు. అవిశ్వాస ప్రక్రియ సమావేశానికి డీసీఓ ధాత్రిదేవి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. అవిశ్వాసం నెగ్గాలంటే 2/3 మెజార్టీ అవసరం ఉంటుంది. 13 మంది సంఘం సభ్యుల్లో 9 మంది ఉంటే సరిపోతుంది.. అయితే 11 మంది చైర్మన్, వైస్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సుదర్శన్‌రెడ్డి

తనపై అవిశ్వాసం పెట్టనున్న నేపథ్యంలో పీఏసీఎస్ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలుస్తుంది. సహకార చట్ట నిబంధనలకు విరుద్ధంగా తనపై అవిశ్వాసం పెడుతున్నారని..ఈ ప్రక్రియను నిలిపివేయాలని న్యాయస్థానానికి వెళ్లినట్లు సమాచారం. దీనిపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు. గురువారం అవిశ్వాస సమావేశం పూర్తికాక ముందే కోర్టు నిర్ణయం వెలువడితే ఈప్రక్రియ కొనసాగుతుందా లేదో స్పష్టం అవుతుంది. అంతవరకు వేచిచూడాల్సిందే. అవిశ్వాసం నెగ్గితే వెంటనే కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ప్రిసైడింగ్ అధికారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని సమాచారం.

చైర్మన్ రేసులో పాండు రంగారెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి చెందిన టేకుల సుదర్శన్‌రెడ్డిని పదవిచ్యుతుడిని చేసేందుకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి పావులు కదిపారు. ఈ చైర్మన్ పదవిని ఆయన ఆశిస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితి తర్వాత ఎప్పుడైనా పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే అవకాశం ఉంది. నాలుగేండ్ల కాలపరిమితి ముగిసి మరొక్క సంవత్సరం ఈ పాలకవర్గం పనిచేసే అవకాశమున్న నేపథ్యంలో సభ్యులు అవిశ్వాసానికి తెరలేపారు.

ముసలానికి కారణం

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైస్ పర్సన్ కప్పరి స్రవంతిపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస నోటీసుల ప్రభావ ఫలితంగా బీఆర్ఎస్‌కు చెందిన ఉప్పరిగూడ సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పడినట్లు రాజకీయవర్గాలు చర్చించుకుంటున్నాయి. స్రవంతిపై అవిశ్వాసం పెట్టి తన గ్రామానికి చెందిన కౌన్సిలర్ శ్రీలతను చైర్ పర్సన్ చేయాలని సుదర్శన్‌రెడ్డి ప్రయత్నించిన కారణంగా అతని పదవికి కాంగ్రెస్ పార్టీ నేతలు ఎసరు పెడుతున్నారని అంతటా చర్చానీయాంశంగా మారింది. దీంతో రసవత్తరంగా రాజకీయాలు మారాయి.